క్లుప్తంగా

మార్మోగిన గోవింద నామస్మరణ



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై గోవింద నామస్మరణ మార్మోగింది. కొండపై కొలువుదీరిన స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాల బోగం అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం అనంతరం సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

కనులపండువగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ కనులపండువగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతి అందజేశారు. సేవలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాత లక్ష్మీనారాయణకు బాండ్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలంలోని చంద్రాగార్డెన్స్‌కు చెందిన పాలకొల్లు లక్ష్మీనారాయణ (మనోరథ్) అనే దాత శనివారం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. కుటుంబ సమేతంగా సింహగిరి వచ్చిన దాత, విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రోటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందించారు. దేవస్థానం తరపున దాతకు సూర్యనారాయణ బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. దేవస్థానం ఏఈఓ తాతాజీ, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సమాచార కమిషనర్



చావలి సునీల్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందజేశారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



పేదలకు బియ్యం బస్తాలు అందిస్తున్న చొక్కాకుల వెంకట్రావు, నాయకులు

సబ్బవరం: ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ జన్మదినోత్సవం సందర్భంగా శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం తవ్వవానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో 150 మందికి బియ్యం బస్తాలతో పాటు నిత్యావసర సరకుల వితరణ చేపట్టారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. సబ్బవరంలో నిర్మాణంలో ఉన్న శివాలయానికి రూ.లక్ష, వంగలి, టెక్కలిపాలెంలో నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ.50 వేలు చొప్పున విరాళం అందించారు. తవ్వవానిపాలెం అభివృద్ధికి రూ.50 వేలు, గ్రామంలో ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేపట్టేందుకు హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన వేడుకల్లో ప్రముఖ పారిశ్రామిక వేత్త చొక్కాకుల వెంకట్రావు కేక్ కట్ చేసి, బోకం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తినిపించారు. సర్పంచ్ బోకం స్వామినాయుడు, సబ్బవరం మండలంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

- ఇంటింటికీ రేషన్ సరుకుల విధానానికి చెక్ పెట్టడంతో డిపోల వద్ద లబ్ధిదారుల రద్దీ
- కానరాని సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ
- సరుకుల కోసం రెండు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి
- నెల మొదటి వారంలోగా వెళ్లకపోతే సరుకులకు మంగళం



గత ప్రభుత్వంలో ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందజేస్తున్న ఎండీఎం ఆపరేటర్లు (ఫైల్)

మళ్లీ అవే అగచాట్లు.. సిగపట్లు

సబ్బవరం: కూటమి నాయకులు తాము అధికారం చేపట్టిన తర్వాత రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ మరింత పటిష్టంగా అమలు చేస్తామని గొప్పలకు పోయారు. తీరా గెలిచాక గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఇంటి వద్దకే రేషన్ సరుకుల విధానానికి స్వస్తి పలికింది. అలా చేస్తే రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని ఊదరగొడుతూ రేషన్ లబ్ధిదారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. పాత విధానంలోనే రేషన్ డిపోల వద్ద లైను కట్టి తీసుకునే విధానానికి తెర లేపింది. దీంతో లక్షలాది రూపాయలు విలువ చేసే ఎండీఎం వాహనాలు మూలకు చేరడంతో పాటు వాటి నిర్వాహకులైన ఆపరేటర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి కల్పించింది.

చెప్పిందొకటి.. చేస్తున్నదొకటి..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమలు, ఆయిల్ ప్యాకెట్ల వంటి నిత్యావసర సరుకులు అందజేస్తామన్నారు. అధికారం చేపట్టి సంవత్సరం పైగా అవుతున్నా చెప్పినవేవీ జరగడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటికే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చిన కూటమి ప్రభుత్వం మండలంలో ఎక్కడా మచ్చుకైనా అలా చేయలేదు. మొదటి నాలుగైదు రోజుల్లో తీసుకోకపోతే ఆ ఇచ్చే వాటిని కూడా వదులుకోవాల్సినట్లుంది పరిస్థితి అని రేషన్ కార్డుదారులు వాపోతున్నారు.

రెండు, మూడు కిలోమీటర్లు నడవాల్సిందే..

సబ్బవరం మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 59 గ్రామాలున్నాయి. ఆయా పంచాయతీల పరిధిలోని ప్రధాన గ్రామాల్లో 31 వరకూ రేషన్ డిపోలున్నాయి. మిగిలిన శివారు గ్రామాల్లోని లబ్ధిదారులంతా ఆయా గ్రామాల్లోని రేషన్ డిపోలకు కనీసం 2 నుండి మూడు కిలోమీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాలి. తీరా లబ్ధిదారులు వెళ్లేసరికి రేషన్ డిపోలు తెరవక పోయినా, రద్దీగా ఉన్నా వెనుదిరగక తప్పదు. డిపోల్లో రేషన్ సరుకులు సకాలంలో తీసుకోకపోతే ఇక ఆ నెల రేషన్ సరుకులను మరిచిపోక తప్పదు.

మండల ముఖచిత్రం ఇదీ..

రేషన్ డిపోలు	రేషన్ కార్డులు	మొత్తం లబ్ధిదారులు	గ్రామ పంచాయతీలు	మొత్తం గ్రామాలు
31	21,318	61,136	24	59



మూసి ఉన్న పాత సబ్బవరంలోని రేషన్ డిపో వద్ద కనిపించని డిపో వివరాలు, నిత్యావసర సరుకుల ధరల పట్టిక



ఇటీవల నారపాడు శివారు బలిజపాలెంలో ఏర్పాటు చేసిన రేషన్ స్టాక్ పాయింట్

బియ్యంతో పాటు ఇతర సరుకులూ ఇవ్వాలి..



గతంలో ఇంటి ముందుకు వచ్చి రేషన్ సరుకులు అందజేసేవారు. ప్రస్తుతం డిపోకి వెళ్లి రేషన్ తీసుకుంటున్నాం. బియ్యంతో పాటు కందిపప్పు, ఆయిల్, గోధుమల వంటివి పంపిణీ చేస్తే బాగుంటుంది. నెలలో మొదటి వారంలోగా సరుకులు తీసుకోకపోతే పంచదార కూడా దొరికే పరిస్థితి లేదు.

– బండారు కిరణ్ కుమార్, గొటివాడ కాలనీ, సబ్బవరం మండలం

రేషన్ కోసం రెండు కిలోమీటర్లు నడుస్తున్నాం..



మాది వంగలి శివారు తెలుకులపాలెం. ఇక్కడ సుమారు 30 వరకూ నివాసాలు ఉంటాయి. గతంలో మా ఇంటి సమీపానికి రేషన్ బండి వచ్చి సరుకులు ఇచ్చేది. ఇప్పుడు వంగలి రేషన్ డిపోలో సరుకులు తీసుకోమంటున్నారు. అది మా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. చచ్చినట్లు అంత దూరం వెళ్లి రేషన్ తీసుకుంటున్నాం.

– వడిశల వరలక్ష్మి, తెలుకులపాలెం, వంగలి పంచాయతీ, సబ్బవరం మండలం

డిపో దూరంగా ఉంటే స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తాం..



ప్రస్తుతం లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే విధానం కొనసాగుతోంది. దీంతో కొన్ని చోట్ల స్టాక్ అయిపోయినా వెంటనే అదనంగా అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడైనా గ్రామానికి డిపో రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే ఆ గ్రామంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి రెండు రోజుల పాటు రేషన్ సరుకులు అందజేసే ఏర్పాటు చేస్తున్నాం.

– బి. చిన్నికృష్ణ, సబ్బవరం తహసీల్దార్, సబ్బవరం మండలం

---

40 సెల్‌ఫోన్ల రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఎస్‌ఐ సూరిబాబు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 40 సెల్‌ఫోన్లను క్రైం విభాగం పోలీసులు రికవరీ చేశారు. నెల రోజుల వ్యవధిలో దాదాపు రూ.5 లక్షల విలువైన ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను క్రైం ఎస్‌ఐ డి.సూరిబాబు వెల్లడించారు. కొన్నాళ్లుగా పెందుర్తి పరిసర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీ, పొరపాటున పోగొట్టుకున్న ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపట్టారు. సీఈఐఆర్ యాప్ ద్వారా ఆయా ఫోన్ల డేటా, ఇతర సమాచారాన్ని సేకరించి అవి ఎక్కడ ఉన్నాయో గుర్తించారు. తక్షణమే ఆయా ప్రాంతాలకు వెళ్లి వాటిని రికవరీ చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆ సెల్‌ఫోన్లను త్వరలో నగరంలో జరగనున్న ప్రాపర్టీ మేళాలో పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి చేతుల మీదుగా బాధితులకు అందిస్తామన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన పెందుర్తి క్రైం ఎస్‌ఐ సూరిబాబు, ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీ జి.నాగరాజు, పీసీలు టి.శివప్రసాద్, ఆర్.సంతోషి, ఎల్.ఎస్. నాయుడు, జి.శ్రీనివాసరావు, ఆర్.వెంకటేశ్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు



సాయి సాత్విక్ (ఫైల్)

పరవాడ: స్థానిక సినిమా హాలు జంక్షన్‌లో నివాసం ఉంటున్న కూండ్రపు సత్యారావు కుమారుడు కూండ్రపు సాయి సాత్విక్ (15) శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని తండ్రి సత్యారావు శనివారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయిసాత్విక్ సొంట్యాం దగ్గర విశ్వ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో అలిగి ఉత్తరం రాసి శనివారం మధ్యాహ్నం 1.30 సమయంలో సినిమా హాలు కూడలిలో ఆటో ఎక్కి స్టీల్‌ప్లాంట్ వైపు వెళ్లినట్లు ఆ ఫిర్యాదులో సత్యారావు పేర్కొన్నారు. సాత్విక్ 6 అడుగుల ఎత్తు, చామనఛాయ, సైడ్ క్రాఫ్‌తో ఉంటాడు. మెరూన్ కలర్ నెక్ టీ షర్టు, బ్లాక్ కలర్ ఫుల్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సాయి సాత్విక్‌ను గుర్తించిన వారు 9440796038 నంబరుకు సమాచారం అందించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు కోరారు.

నరవలో 8 మంది జూదరుల అరెస్ట్

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 88వ వార్డు నరవలో జూదమాడుతున్న 8 మందిని టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు శనివారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.39,100 నగదును స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ కె.వి. సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నరవలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు నాణేలు ఎగరేసి జూదం ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌తో పాటు పెందుర్తి పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకుని జూదమాడుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పాడి పశువులకు థైలేరియా టీకాలు



పెదనాయుడుపాలెంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏడీ చిట్టినాయుడు

సబ్బవరం: పాడి పశువులలో వచ్చే థైలేరియా వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిట్టినాయుడు సూచించారు. 3 నెలలు దాటిన సంకరజాతి పాడి పశువులన్నింటికీ ఈ టీకాలు వేయించాలన్నారు. మండలంలోని పెదనాయుడుపాలెం, బోదువలస గ్రామాల్లో శనివారం నిర్వహించిన థైలేరియా టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 2,350 పాడి పశువులకు ఈ టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ కనకరాజు, గోపాలమిత్ర కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై మందుబాబు హల్‌చల్



కూటమి ప్రభుత్వం అందిస్తున్న అత్యంత 'నాణ్యమైన' మద్యం మందుబాబులపై స్వారీ చేస్తోంది. శనివారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న చినముషిడివాడ కూడలి బీఆర్‌టీఎస్ రహదారిపై మద్యం సేవించిన ఓ మందు బాబు మధ్యాహ్నం వీరంగమాడాడు. వాహనాలు అత్యంత రద్దీగా తిరుగుతున్న సమయంలో రోడ్డుపై కాలు మీద కాలు వేసుకుని పడుకుని వాహన చోదకులకు పట్టపగలే చుక్కలు చూపాడు. పెందుర్తి పోలీసులు తమదైన శైలిలో అతన్ని అక్కడి నుంచి పంపించేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. – పెందుర్తి

27న జిల్లా స్థాయి యోగా పోటీలు

పరవాడ: అనకాపల్లి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న వెన్నలపాలెం బండారు అప్పలనాయుడు ఏసీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించనున్నట్లు అనకాపల్లి యోగాసన కార్యదర్శి సీహెచ్.ఆంజనేయులు, అధ్యక్షుడు పి.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన అభ్యర్థులు ఆగస్టులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనదలచిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదిలోగా 9398740982 నంబరుకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

మానసిక రోగి ఆస్పత్రికి తరలింపు

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో తిరుగుతున్న ఓ మానసిన రోగిని పెందుర్తి పోలీసులు చికిత్స నిమిత్తం నగరంలోని మానసిన వైద్యశాలకు తరలించారు. వివరాలివి..పెందుర్తి ప్రాంతంలో ఓ వ్యక్తి (30–35 సం.) కొద్దిరోజులుగా సంచరిస్తున్నాడు. తన చేష్టలతో స్థానికులను భయపెడుతున్నాడు. దీనిపై స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై స్పందించిన సీఐ కె.వి సతీష్‌కుమార్ బ్లూకోట్స్ సిబ్బందిని శనివారం అక్కడకు పంపారు. మానసిక వికలాంగుడిని పట్టుకుని వెంటనే నగరంలోని ప్రభుత్వ మానసిక రోగుల ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- వారిని దోచుకుంటున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్



డీసీహెచ్‌ఎస్ శంకర్ ప్రసాద్‌తో చర్చిస్తున్న రమణ

పెందుర్తి: ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల ఆకలి బాధలు ప్రభుత్వానికి పట్టకపోవడం దురదృష్టకరమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, పెస్ట్ కంట్రోల్ కార్మికుల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్యం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కార్మికుల పీఎఫ్ డబ్బులు కట్టకుండా కాంట్రాక్టర్లు వారి శ్రమ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే అలాంటి కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కోరారు. వేతనాలు నెలనెలా వచ్చేలా చేయడంతో పాటు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ఈ మేరకు డీసీహెచ్‌ఎస్ శంకర్‌ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సంఘం ప్రతినిధులు కోన లక్ష్మణ, ఆకుల భవాని, నమ్మి లక్ష్మి, సీతమ్మ, లక్ష్మి, నూకరాజు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంచాలి

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

సింహాచలం: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. తెలుగు, ఇంగ్లిష్ లాంగ్వేజీలకు సంబంధించిన ప్రశ్నలను అడిగి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సంసిద్ధత కార్యక్రమాన్ని పరిశీలించారు. తెలుగు, ఇంగ్లిష్ అభ్యసన కృత్యాలు చేసిన తీరును పరిశీలించి, కొన్ని పదాలను డిక్టేషన్ రాయించారు. పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యాశక్తి కార్యక్రమంలో భాగంగా రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక తరగతి నిర్వహించాలని సూచించారు. కరదీపికలు అనుసరించాలన్నారు.

ఇంగ్లిష్ మెటీరియల్ పంపిణీ

పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయిని సుసర్ల పద్మావతి స్వయంగా తయారు చేసిన 10వ తరగతి ఇంగ్లిష్ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను విడనాడితే ప్రకృతికి మేలు



రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రైతుబజార్ ఈవో షర్మిల



పరవాడలో స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న అధికారులు, సచివాలయ ఉద్యోగులు



సబ్బవరం మండల విద్యావనరుల కేంద్రంలో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఈవో లక్ష్మణరావు



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు

పెందుర్తి: వార్డులో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తున్నామని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు అన్నారు. వార్డులో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పర్యావరణానికి మేలు చేసే నూలు, గుడ్డ సంచులు వాడాలని పిలుపునిచ్చారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- పెందుర్తి రైతుబజార్ ఆవరణలో ఈవో పద్మావతి షర్మిల ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు ఈవో తెలిపారు. ముందుగా స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు.
- 95వ వార్డులో కార్పొరేటర్ ముమ్మన దేముడు స్వచ్ఛ భారత్ ర్యాలీలో పాల్గొని ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు.

పరవాడలో అవగాహన

పరవాడ: మండలంలో పరవాడ, నాయుడుపాలెం గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పరవాడ మండల పంచాయతీ విస్తరణాధికారి ధర్మారావు, ఏపీఎం రంగారావు, పరవాడ పంచాయతీ కార్యదర్శి మురళీ పట్నాయక్, నాయుడుపాలెం సర్పంచ్ కె.వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి త్రినాథరావు, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై..

సింహాచలం: సింహగిరిపై శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు, సిబ్బందితో ఆలయ రాజగోపురం వద్ద ఈవో వి.త్రినాథరావు ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణకు అంతా పాటుపడాలన్నారు. రాజగోపురం ప్రాంగణం, నక్షత్రవనం, కొండపై బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో శుభ్రత పనులు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో రమణమూర్తి, సూపరింటెండెంట్లు జి.వి.వి.ఎస్.కె.ప్రసాద్, పంతం శ్రీనివాస్, వెంకట రమణ, పాలూరి నరసింగరావు, శానిటరీ సూపర్‌వైజర్ కొండబాబు, పీఆర్వో నాయుడు, ఇంజినీరింగ్, ఆలయ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం: స్థానిక విద్యా వనరుల కార్యాలయంలో జరిగిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు. కార్యాలయ సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. ఎంఆర్‌సీ సిబ్బంది మహేష్, భూ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- మొగలిపురంలో మాజీ ఎమ్మెల్యే, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ గ్రామ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త తొలగించారు. గ్రామ సర్పంచ్ గండి అరుణ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బర్థికాన సాయినాథరావు తదితరులు పాల్గొన్నారు.